సాక్షి
పల్నాడు

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024


అన్నా...జగన్‌తో కరచాలనం చేస్తున్న మహిళలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
నరసరావుపేట	6.29	4.42
బాపట్ల	6.27	4.40
గుంటూరు	6.27	4.40

వినుకొండలో బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం, ఇన్‌సెట్‌లో ఓ అవ్వ బాధను ఆలకిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


అభిమాన ప్రభంజనం


బస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పక్కన ఎమ్మెల్యే బొల్లా



మరో ప్రభంజనానికి నాందిలా
మహోజ్వలిత చరితకు స్ఫూర్తిలా..
మహా సంగ్రామంలో సైనికుల్లా...
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగమనంతో
పల్నాట పల్లెలు, పట్టణాలు పరవశిస్తున్నాయి..
పాదం పాదం కలుపుతూ కదం తొక్కుతున్నాయి..
చేయి చేయి కలిపి సంఘటితమవుతున్నాయి
'మేమంతా సిద్ధం' యాత్రలో ఉరకలెత్తుతున్నాయి..
రేపటి వెలుగులకు దిక్సూచిగా మారుతున్నాయి..
రాజన్న బిడ్డ వెంటే మేమంటూ ...
రావాలి మళ్లీ మీరే మా ముఖ్యమంత్రిగా అంటూ
జయ జయ జయహో అంటూ జేజేలు పలుకుతున్నాయి...
జగన్నినాదానికి గొంతుకలవుతున్నాయి..

సమస్యలు వింటూ.. పరిష్కారం చూపుతూ

బాధితుల సమస్యలు సీఎం వైఎస్ జగన్ ఓపికగా విన్నారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసి వెంటనే పరిష్కారం అయ్యేలా చూశారు. నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన దంపతులు కీర్తిపాటి వేణుకుమార్, అనురాధలు తమ కుమార్తె ప్రైజీ(9) కంటి సమస్యను జగనన్న దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా వారి అర్జీని తెప్పించుకొని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అర్జీ అందుకున్న గంటల వ్యవధిలోనే సీఎంఓ కార్యాలయం నుంచి తండ్రికి ఫోన్ కాల్ రావడంతో, తమ చిన్నారి సమస్య పరిష్కారానికి మార్గం సులభతరం కావస్తుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ హృదయాలలో పెట్టుకొంటామంటూ సంతోషం వ్యక్తం చేశారు.

- శావల్యాపురం మండలం కారుమంచి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మల్లాపరపు పున్నారావు-రుసీస్లు తమ కూతురు రోహిణి ఐదు సంవత్సరాల నుంచి వెన్నుపూస వ్యాధితో బాధపడుతుందని పలు వైద్యశాలలో వైద్య చికిత్స చేయించినా నేటి వరకు పురోగతి లేదని దానికితోడు ఆరోగ్యశ్రీ కార్డు వర్తించలేదని రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.
- మండలంలోని భాస్కర్‌నగర్ గ్రామానికి చెందిన సజ్జా సౌజన్య తన భర్త పాముకాటుతో మృతి చెంది సంవత్సరాల గడుస్తున్నా నేటి వరకు ప్రభుత్వ పరంగా బీమా రూ.5 లక్షల మంజూరు కాలేదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తెలిపారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.
- బస్సు యాత్ర సీతారామపురం జంక్షన్ వద్దకు చేరుకోగానే మోదుగుల వెంకటేశ్వరమ్మ అనే మహిళ డాక్టర్ నడవలేని స్థితిలో ముఖ్యమంత్రి కాన్వాయ్ దగ్గరకు చేరుకుంది. ఆమెను చూసిన జగన్ వెంటనే బస్సు ఆపి ఆమె వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. తనకు సీతారామపురం గ్రామంలో 2.46 ఎకరాల భూమి ఉందని, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అనుచరులు ఆక్రమించుకొని 80 సెంట్లు మాత్రమే రెవెన్యూ రికార్డులో భూమి ఉన్నట్లు చూపించారని ముఖ్యమంత్రికి వివరించింది. సమస్యను పరిష్కరించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

- పల్నాడు గడ్డపై అడుగిడిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- అడుగడుగునా జననీరాజనం
- సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- దారిపొడవునా పూలవర్షం కురిపించిన అభిమాన జనసందోహం
- మార్మోగిన జగన్నినాదం

సాక్షి ప్రతినిధి,గుంటూరు/సాక్షి,నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడులో ప్రవేశించింది. సంక్షేమ సారధికి ప్రజలు నీరాజనాలు పలికారు. అభిమానం ఉప్పొంగింది. మండు వేసవిలోనూ దారి పొడవున సంతోషాల జల్లు కురిసింది. భగభగ మండే భానుడు సైతం ప్రజాభిమానం ముందు మూగబోయాడు. ఎండను కూడా లెక్క చేయకుండా తమ అభిమాన నేత కోసం మహిళలు, అవ్వలు, తాతలు రోడ్లపై వేచి చూశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర వినుకొండ నియోజకవర్గంలో ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. చిన్నారుల కేరింతలు..విద్యార్థుల సంబరాలు... యువత ఆనందోత్సాహాలు..మహిళల అభిమానం నడుమ బస్సు యాత్ర ముందుకు కదిలింది.

చింతలచెరువులో ఘనస్వాగతం

తొలుత వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామంలోకి ప్రవేశించింది. తమ అభిమాన నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, చిలకలూరిపేట అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నాయకులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంతో కదం తొక్కారు.

ఆప్యాయంగా పలకరిస్తూ...

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సులో నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఐనవోలు గ్రామంలో దివ్యాంగులైన చంద్ర ప్రసన్న, చంద్ర చంద్రశేఖర్‌లు మండుటెండను లెక్కచేయకుండా సీఎం రాక కోసం వేచి ఉన్నారు. ఇది గమనించిన సీఎం వారిని పలుకరించారు. దీంతో వారి సంతోషానికి అవధుల్లేవు. సీఎం జగన్ మాట్లాడుతూ మరలా మనందరి ప్రభుత్వం వస్తుందని మనందరి ప్రభుత్వంలో మీకు తగిన మేలు జరుగుతుందని హామీ ఇచ్చారు.


నిలువెత్తు అభిమానం...వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం

జనకొండ... వినుకొండ

వినుకొండ వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. జననేత బస్సు యాత్రకు సంఘీభావం తెలిపేందుకు వేలాది మంది ప్రజలు దారిపొడువునా నిలబడి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు భారీ గజమాలలను క్రేన్ల సహాయంతో దారి పొడువునా ఉంచి వైఎస్ జగన్‌ను పట్టణంలోకి ఆహ్వానించారు. చీకటీగలపాలెం వద్ద పెద్దఎత్తున ముస్లిం మహిళలు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బస్సు వినుకొండ చెక్‌పోస్టు సెంటర్ వైపుగా వెళ్లింది. తన కోసం మండుటెండలో వేచి చూస్తున్న అభిమానులకు బస్సు టాప్ నుంచి అభివాదం చేస్తూ వైఎస్ జగన్ ముందుకు సాగారు. బస్సుపైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ఆయన వెంట ఉండి ప్రజలకు అభివాదం చేశారు. అటు నుంచి శివయ్య స్థూపం సెంటర్‌మీదుగా రైల్వేస్టేషన్ రోడ్డు, నిర్మలా స్కూల్ మీదుగా వినుకొండ పట్టణంలో బస్సు యాత్ర సాగింది.


నమస్తే మామ...చిన్నారి ఆనందం


అభిమాన నేతను చూసేందుకు వచ్చిన మహిళలు

అభిమాన నేతను చూసిన ఆనందం


చిన్నా...జగన్ మామయ్య కనిపించారా

వినుకొండ నుంచి విఠంరాజుపల్లి, కనమర్లపూడి గ్రామాల మీదుగా బస్సు యాత్ర సాగింది. అడుగడుగున మహిళలు, యువత రోడ్డుపై నిల్చుని కాన్వాయ్‌ని ఆపి తమ అభిమాన నేతను తనివితీరా చూశారు. దారిమధ్యలో నిల్చుని తమ సమస్యలు తెలిపిన వారికి అక్కడిక్కడే వైఎస్ జగన్ పరిష్కార మార్గం చూపారు. అక్కడి నుంచి శావల్యాపురం, పోట్లూరుల మీదుగా యాత్ర సాగింది. రాత్రి 8 గంటలైన రోడ్డుపై బస్సు యాత్ర కోసం వేచి చూసి జననేతకు ఘన స్వాగతం పలికారు. తర్వాత గంటావారిపాలెం గ్రామంలో అభిమానులకు సీఎం అభివాదం చేసుకుంటూ యాత్ర సాగి, రాత్రి 8.30 గంటలకు గంటావారిపాలెం శివారులో ఏర్పాటుచేసిన బస శిబిరానికి సీఎం చేరుకున్నారు. దీంతో తొలిరోజు పల్నాడు జిల్లాలో మేమంతా సిద్ధం యాత్ర విజయవంతంగా ముగిసింది.

చురుగ్గా సిద్ధం సభ ఏర్పాట్లు : ఎమ్మెల్యే కాసు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న 'మేమంతా సిద్ధం' సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో ఈ నెల 10న నిర్వహించే సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు బచ్చే మేస్త్రీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, ఎండీ అలీం, ప్రేమ్‌రాజ్, ఇల్లూరి వెంకయ్య, కొండలు, ఇర్లా గురుస్వామి పాల్గొన్నారు.

'మీ మనసు మాకు తెలుసు'

- ఐనవోలులో దివ్యాంగ అన్నాచెల్లెళ్ల చెంతకు సీఎం వైఎస్ జగన్
- ఆప్యాయంగా పలకరించి.. ఆనందబాష్పాలను తుడిచి..



నూజెండ్ల మండలం చింతలచెరువులో సీఎంను చూసి అభివాదం చేస్తున్న మహిళలు

లక్ష్మీపురం/ పట్నంబజారు: ఆయన వస్తున్నారని తెలిసిన ఆ అభిమానం ఉప్పొంగిపోయింది. తమ జీవితాల్లో వెలుగులు నింపిన ప్రియతమ నాయకుణ్ని ఎలాగైనా కలిసి మనసులోని మాటను పంచుకోవాలనుకున్నారు. కానీ బయటికొస్తే తాళలేని వేడి తీవ్రత. అయినా వారి మనో సంకల్పం ముందు ఆటంకాలన్నీ ఆవిరయ్యాయి. గుండె గూటిలో కొలువైన నాయకుడిని చూసేందుకు దూరభారం మరిచి రెక్కలు కట్టుకువచ్చిన ఆ దివ్యాంగ అన్నాచెల్లెళ్ల ప్రయాస ఫలించింది. వారికళ్లు తనవైపే ఆత్రంగా ఎండల్లో ఎదురుచూస్తున్నాయని తెలుసుకున్న ఆ గొప్ప మనసు వారివైపు అడుగులు వేస్తూ వారితో ముచ్చటించాడు. అంతే వారిద్దరి కళ్లు ఆనందబాష్పాలతో తడిసిముద్దయ్యాయి. ఆప్యాయంగా కన్నీటిని తుడిచిన ఆ హస్తాలను అమాంతంగా పట్టుకుని ముద్దాడారు. అంతటితో వారి మనసులు దూదిపింజెల్లా తేలిపోయాయి. అంతేకాదు కలిసి ఫొటోలు దిగడంతో ఆనందం అంబరాన్నంటింది. ఈ అరుదైన దృశ్యం సీఎం జగన్ మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా చోటుచేసుకుంది. వినుకొండ మండలం ఐనవోలులోకి బస్సుయాత్ర రాగా ఆ దివ్యాంగ అన్నా చెల్లెళ్ల చెంతకు సీఎం జగన్ వెళ్లడంతో ..ఆ మనసు కడిగిన ముత్యం లాంటిదని నిరూపితమైందని అక్కడున్న వారంతా అనుకున్నారు.

నా మనవడు మరోసారి గెలవాలి



నా మనుమడు జగన్ ప్రభుత్వంలో నా కుటుంబానికి మంచే జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఆరోగ్యశ్రీ ద్వారా గుండె ఆపరేషన్ చేశారు. ఆయన చలువే నాకు మరో జీవితాన్ని ప్రసాదించింది. నేను వృద్ధాప్య పింఛన్‌తో ఆర్థికంగా కొంత వెసులుబాటు పొందాను. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ అవకాశం లేకుండా చేశారు. జగన్ మరోసారి గెలవాలి, మా దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయి.

–దగ్గుబాటి వెంకమ్మ, మృత్యుంజయపురం, నూజెండ్ల మండలం

నా వంతుగా ప్రచారం చేస్తా



నాకు ఎవరూ లేరయ్యా. ఆ దేవుడే నాకు జగన్ రూపంలో కొడుకుగా అందించాడు. నెల తిరిగే సరికి ఠంచన్‌గా పింఛన్ అందుకుంటున్నా. వలంటీర్ ఇంటికి వచ్చి రూ.3 వేలు చేతిలో పెడుతుంటే ఆ సంతోషం మాటల్లో చెప్పలేనిది. ఏ దిక్కూ లేని నాలాంటోళ్లకి జగనే పెద్దదిక్కు. నా బిడ్డ విజయం సాధించాలి. అందుకు నావంతుగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తా.

– లగడపాటి శేషమ్మ, ఐనవోలు గ్రామస్థురాలు, లక్ష్మీపురం, పట్నంబజారు



నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని పల్నాడు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

గుండెపై చెరగని ముద్ర



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి ముగ్ధుడినైపోయాను. ఆయన అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి బాగుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, పాలనా చిరస్థాయిగా నిలిచిపోతాయి. నేను కూడా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని నా గుండెపై చిరస్థాయిగా నిలిచిపోయేలా చెరగని ముద్ర వేసుకున్నాను. నాకు ఎంతో ఆనందంగా ఉంది. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అంటే నాకు అభిమానం.

–అంగటి ఆంజనేయులు, కోర్రముట్ల , ఈపూరు

నాడు-నేడు ఒకటే పలకరింపు



నాడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రలో భాగంగా మా ఇంటికి వచ్చారు. నాడు ఏ విధంగా పలకరించారో ఇప్పుడు సీఎం హోదాలో ఉన్నా కూడా అదే విధంగా పలకరించారు. సీఎం హోదాలో ఉన్నా ఆయనలో ఏ మాత్రం మార్పు రాలేదు. అన్నా బాగున్నావా అని అనడంతో నా గుండె పులకించిపోయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నా జీవితాంతం గుర్తుంచుకుంటాను.

– మహ్మద్దీన్, మాజీ కౌన్సిలర్, వినుకొండ

రాసి పెట్టుకోండి...ఆయనే సీఎం



అన్నాచెల్లెళ్లమైన మేము పుట్టుకతోనే దివ్యాంగులం. నా అన్న చంద్రశేఖర్‌కు దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో దివ్యాంగ పెన్షన్ మంజూరైంది. ఇప్పుడు ఆయన బిడ్డ, మా జగనన్నపాలనలో నాకు మంజూరైంది. అమ్మ ఒడితోపాటు పలు పథకాలు మా ఇంటి తలుపు తట్టాయి. మా కుటుంబాన్ని కష్టాలనుంచి గట్టెక్కించారు. అందుకే ఆయన్ను చూడటానికి, కలిసేందుకు వ్యయప్రయాసలకోర్చి వచ్చాం. రానున్న ఎన్నికల్లో జగనన్నే సీఎం. ఇది తథ్యం.

చంద్ర ప్రసన్న, చంద్ర చంద్రశేఖర్ దివ్యాంగులు, ఐనవోలు గ్రామస్థులు

మా ఆశీస్సులు జగనన్న కే...



మాలాంటి వృద్ధులకు పింఛను రూ. 3వేలు చేసి మాకంటూ ఓ గౌరవాన్ని కల్పించారు సీఎం జగన్. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఒకటో తేదీ తెల్లవారు జామున వలంటీర్లతో పెన్షన్ పంపిస్తున్న మా బిడ్డ జగన్‌కు మేమందరం తోడుగా ఉంటాం. మా అందరి ఆశీస్సులు జగనన్నకే. ఆయన విజయానికి మా వంతు కృషి చేస్తాం.

– షేక్ హుస్సేనమ్మ వినుకొండ)

ఫ్యాన్ ప్రభం'జనం' ఖాయం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- 12న సత్తెనపల్లి మీదుగా సీఎం జగన్ సిద్ధం రోడ్‌షో
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన శ్రేణులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నేత గుంటూరు జానీ ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ వార్డు నుంచి టీడీపీ, జనసేన పార్టీల క్రియాశీలక నేతలు సోమవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. 6వ వార్డు నుంచి 38వ బూత్ టీడీపీ ఇన్‌చార్జ్ బాషా, ఒంటిపులి అంకమ్మరాజు, రియాజ్, జిలాని, షేక్ అహ్మద్, జనసేనకు చెందిన షేక్ కరీముల్లాలు ఆ పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరినీ మంత్రి అంబటి రాంబాబు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్ని 99 శాతం అమలు చేశామని తెలిపారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి రాష్ట్రానికి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజల్ని కోరారు. ముస్లింలకు వైఎస్సార్ సీపీలోనే సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మళ్లీ మోసగించేందుకు టీడీపీ నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని సూచించారు. ఈనెల 12న రాజుపాలెం నుంచి గుంటూరు వరకు సత్తెనపల్లి ప్రధాన రహదారి మీదుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధం బస్సు యాత్ర రోడ్ షో ఉంటుందని, దీన్ని జయప్రదం చేయాలని మంత్రి అంబటి పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలోకి క్రియాశీలక శ్రేణులు చేరడం ఆహ్వానించి దగ్గ పరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోడిరెక్క దేవదాస్, నాయకులు పెద్దింటి నాగేశ్వరరావు, వల్లెం నరసింహారావు, మందడపు సాయి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- వైఎస్సార్‌సీపీలో చేరిన పీసపాడు టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలు

క్రోసూరు: ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన 14 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి క్రోసూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం అందరూ కలసి పనిచేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో షేక్ మీరావలి, షేక్ బాజీ, మస్తాన్ వలి, సయ్యద్ జాన్ మహమ్మద్, సయ్యద్ కరీముల్లా, షేక్ రబ్బానీ సాహెబ్, శ్రీను, అమరయ్య, లక్ష్మీనారాయణ, వెంకట్రావు, అశోక్, అంకమ్మరావు, కోటేశ్వరరావు, కిశోర్ ఉన్నారు.

రూ.2 కోట్లు దాటిన స్వాధీన సొత్తు

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు, మద్యం తదితర వాటి విలువ రూ. 2,00,49,180కు చేరింది. ప్రత్తిపాడు నియోజకవర్గ పరధిలో రూ.2.54 లక్షలు, తెనాలి పరిధిలో రూ.3.34 లక్షలను సోమవారం తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.


శుభోదయం ముఖ్యమంత్రి గారు
ఫ్యాన్ గుర్తుకే
మన ఓటు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి
వినుకొండ నియోజకవర్గ ప్రజానీకానికి
శ్రీ క్రోధి నామ సంవత్సర
ఉగాది శుభాకాంక్షలు
వినుకొండ నియోజకవర్గంలో నిన్న జరిగిన
మేమంతా సిద్ధం బస్సు యాత్రకు
విచ్చేసి విజయ వంతం చేసిన
వినుకొండ నియోజకవర్గ ప్రజానీకానికి
వైయస్ఆర్‌సిపి నాయకులకు,
కార్యకర్తలకు, అభిమానులకు
పేరుపేరున మా హృదయపూర్వక కృతజ్ఞతలు
బొల్లా గిరిబాబు
వై.యస్.ఆర్.సి.పి. యువ నాయకులు
వినుకొండ నియోజకవర్గం
వినుకొండ నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ
బొల్లా బ్రహ్మనాయుడు
శాసనసభ్యులు, వినుకొండ

మంత్రి అంబటి ఉగాది శుభాకాంక్షలు

సత్తెనపల్లి: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సోమవారం ఆకాంక్షించారు. సంక్షేమ, సౌభాగ్యాలతో వెలుగొందాలని, పల్లె సీమలు పాడిపంటలతో కళకళలాడాలని కోరారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆనందంగా జీవించాలన్నారు. ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 511.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 809.90 అడుగుల వద్ద ఉంది

నిమ్మకాయల ధరలు

తెనాలి టౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.5200, గరిష్ఠ ధర రూ.7100, మోడల్ ధర రూ.6000 వరకు పలికింది.





బాప్‌రే.. భానుడి భగభగలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పొంచిఉన్న వడదెబ్బ ప్రమాదం
- రక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రాణాంతకమే



భట్లూరులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పణిదం వైద్య సిబ్బంది



రెంటపాళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పణిదం వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: వేసవి ప్రారంభంలోనే పల్నాడు జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అజాగ్రత్తతో బయటకు తిరిగే వ్యక్తులు వడదెబ్బకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గత నెలాఖరిలో 35 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. రోజురోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో భానుడి భగభగలు మిన్నంటుతున్నాయి. ఈ వేసవి సీజన్ ముగిసేనాటికి సాధారణ ఉష్ణోగ్రతలు కంటే దాదాపు మూడు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనివల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు, రోగనిరోధకశక్తి తక్కువ ఉన్నవారు, రోగులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.

వడదెబ్బ అంటే...

వేసవి దృష్ట్యా ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో శరీరం ఉష్ణోగ్రతలను తట్టుకోవడం లేదా నియంత్రించే శక్తి విఫలం కావడం వల్లే మనిషి వడదెబ్బ తగులుతుంది. సరైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకపోవడం, తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన, శక్తికి మించి పనులు చేయడం వల్ల కూడా తగులుతుంది. వేడిగాలుల వల్ల వడదెబ్బ (సన్‌స్ట్రోక్) తగలడం, శరీరంలో లవణాలు కోల్పోవడం (డీహైడ్రేషన్)తో కలిగే దుష్పరిణామాల వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. వేడి వాతావరణంలో సంచరించేటప్పుడు అధిక ఉష్ణోగ్రత ముక్కు, కళ్ల ద్వారా శరీరంలోకి చేరుతుంది. దీనివల్ల ఉష్ణోగ్రత అసాధారణంగా 106 డిగ్రీల వరకూ అమాంతంగా పెరిగిపోయే అవకాశం ఉంటుంది. చర్మం పొడిబారిపోయి ముట్టుకుంటే కాలిపోయే పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరంలోని ప్రాథమిక అంతర్గత అవయవాలు సక్రమంగా పనిచేయక పోవడం వడదెబ్బకు కారణమవుతుంది. అదే సమయంలో నీరు, రక్త పరిమాణం తగ్గిపోవడం వల్ల రక్తపోటు కూడా సంభవించే ప్రమాదం ఉంది. వేసవిలో వడదెబ్బకు గురైన వ్యక్తి సత్వరమే ప్రాథమిక చికిత్సను తీసుకొని తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వైద్య ఆరోగ్యశాఖ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వడదెబ్బకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచి వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తోంది.

లక్షణాలు...

- శరీరం ఉష్ణోగ్రత అమాంతంగా పెరిగిపోవడం
- చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం
- పాక్షికంగా ఫిట్స్ రావడం లేక అపస్మారక స్థితికి చేరుకోవడం
- మగత నిద్ర రావడం, కలవరింతలు పలకడం
- పెదవులు ఎండిపోయి నోరు పిడచకట్టుకుపోవడం

వేసవిలో చేయవలసినవి....

- రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి
- పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలు తరచూ తాగాలి
- లేత రంగు కలిగిన తేలిగ్గా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. రెండు పూటలా స్నానం చేయాలి
- ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు బయటకు వెళితే గొడుగు లేదా టోపీ ధరించాలి లేనిపక్షంలో తలకు రుమాలు చుట్టుకోవాలి
- ఇంట్లో కిటికీలు తెరిచి గదిలోకి గాలి వచ్చి చల్లబడే విధంగా చర్యలు తీసుకోవాలి

వేసవిలో చేయకూడనివి...

- మండు వేసవిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంకాలం 4 గంటల వరకూ బయట తిరగరాదు
- సూర్యకిరణాలు, వేడిగాలులు నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- రహదారులపై విక్రయించే ఆహార పానీయాలు, రంగు నీళ్లు సేవించరాదు. కలుషిత మైన ఆహారం భుజించరాదు
- ఎండ వేళల్లో శరీరంపై భారం పడే పనులు చేపట్టరాదు
- మాంసాహారాన్ని తగ్గించాలి. మద్యం సేవించకుండా ఉండాలి
- ముదురు, నలుపు రంగు దుస్తులు ధరించరాదు
- వేడి అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా పని చేయరాదు. అలసట అనిపిస్తే సత్వరమే చల్లని ప్రదేశంలో సేద తీరాలి.

ఎన్నికల్లో పీవోలు బాధ్యతతో పనిచేయాలి

శిక్షణలో జిల్లా కలెక్టర్ శివశంకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలలో పీఓలు (ప్రిసైడింగ్ అధికారులు) భయంతో కాకుండా బాధ్యతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పీఓలు, ఏఎల్ఎంటీలకు పోలింగ్ సిబ్బందికి శిక్షణపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజున జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైతే చాకచక్యంగా వ్యవహరించి, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి సూచనల్ని ఎప్పటికప్పుడు పాటించాలని చెప్పారు. ప్రిసైడింగ్ అధికారులు విధిగా డైరీలను ఎప్పటికప్పుడు రాసుకోవాలని తెలిపారు. ఈవీఎంలలో సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించే విధంగా దానికి సంబంధించిన కమాండ్స్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సిబ్బంది పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న వెంటనే అక్కడ సదుపాయాల్ని పరీక్షించాలని చెప్పారు. ముఖ్యంగా క్యూలైన్ మేనేజ్‌మెంటు, ర్యాంపు, మంచినీటి వసతి సౌకర్యాలు ఉన్నాయో.. లేదో గుర్తించాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన విధంగా పోల్ డే మేనేజ్‌మెంటు సిస్టమ్‌ను జాగ్రత్తగా అమలుపరచాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

సాగర్ జలాలతో ..
గురజాల ప్రజల దాహార్తి తీర్చండి

జిల్లా కలెక్టర్, ఎన్ఎస్పీ అధికారులను కోరిన గురజాల శాసనసభ్యులు కాసు



నరసరావుపేట: ప్రస్తుత వేసవి నేపథ్యంలో సాగర్ జలాలతో గురజాల ప్రజల దాహార్తిని తీర్చాలంటూ ఎమ్మెల్యే కాసు మహేశ్ రెడ్డి ఉన్నతాధికారులను కోరారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి విడుదలైన నీటిని గురజాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల చెరువులకు తరలించాలన్నారు. ఆ చెరువులను నింపి తాగునీటి సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీరు జి.వరలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. సాగర్ కుడికాలువకు వదిలిన జలాలు బుగ్గవాగు రిజర్వాయర్‌ను రెండురోజుల్లో చేరుతాయన్నారు. కుడికాలువ నుంచి దైద, తంగెడ, ఆకురాజుపల్లి మేజరు, గొట్టిముక్కల మేజరు, జానపాడు మైనరులకు సమృద్ధిగా నీరు ఇవ్వాలన్నారు. దాచేపల్లి పట్టణానికి నీరందించేందుకు నాగులేరు ఉందన్నారు. పూర్తిస్థాయిలో నీరు నిల్వచేయగలిగితే భూగర్భ జలాలు పెరగటంతో పాటు ఈ వేసవిలో ప్రజల కష్టాలు తీరుతాయన్నారు.

ట్యాంకర్లతో సరఫరా చేపట్టాం: ఎమ్మెల్యే

వేసవి నేపథ్యంలో ఇప్పటికే మూడు పట్టణాలు, గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. దేశంలోని పలు పట్టణాల్లో నీటి కరువు ఏర్పడిందన్నారు. బెంగుళూరు వంటి నగరంలో డిప్యూటీ సీఎం గృహంలోనే నీరు లేదన్నారు. అయితే నాగార్జునసాగర్ లాంటి డ్యామ్, బుగ్గవాగు లాంటి రిజర్వాయర్లు మనకు అందుబాటులో ఉన్నందున సమస్యను అధిగమించే అవకాశాలున్నాయన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రూ.230కోట్ల వ్యయంతో జలదీక్ష పనులు జరుగుతున్నాయన్నారు. ఇది పూర్తయితే నియోజకవర్గానికి నీటి సమస్య తీరుతుందన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- క్రోసూరు టీడీపీ కార్యాలయ తాటాకుల పందిరి దగ్ధంపై స్పందన
- పార్టీ కార్యాలయాలు, ఇల్లు ధ్వంసం చేస్తానంటూ టీడీపీ అభ్యర్థి వ్యాఖ్యలపై మండిపాటు
- టీడీపీ నిజ స్వభావం బయటపడిందని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: క్రోసూరు టీడీపీ కార్యాలయ పరిధిలో పందిరి దగ్ధమైన ఘటనలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆరోపణలపై పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఘాటుగా స్పందించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్లుగా పెదకూరపాడులో ప్రశాంత వాతావరణం ఉందన్నారు. కానీ ఎన్నికల వేళ టీడీపీ అభ్యర్థిని ప్రకటించిన రోజు నుంచి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద పందిరి దగ్ధమైన ఘటనతో తనకెలాంటి సంబంధం లేదన్నారు. టీడీపీ వాళ్లే అక్కడున్న, బైకులు, కుర్చీలు అన్నీ క్షణాల్లో మాయం చేసి పందిరి తగలబెట్టుకున్నారన్నారు. గతంలో ధరణికోటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని తగలబెడుతూ ఇద్దరు టీడీపీ కార్యకర్తలు ఆధారాలతో దొరికి పోయారన్నారు. ఇప్పుడు ఎవరు నిప్పు అంటించారో తెలియదంటూ తనపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. బాధ్యులను గుర్తించి శిక్షించాలని పోలీసులను కోరుతున్నానన్నారు. క్రోసూరు ప్రజాగళం సభలో తనపై చంద్రబాబు ఆరోపణలకు సమాధానం మాత్రమే ఇచ్చానని, విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడలేదన్నారు. రాద్ధాంతాలతో రాజకీయాలు చేస్తున్న టీడీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను ఆయన కోరారు.

ఇదేం భాష్యం...

దౌర్జన్యాలు, బెదిరింపులతో రాజకీయాలు చేయవచ్చని భాష్యం ప్రవీణ్ రాజకీయాలకు కొత్త భాష్యం చెబుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విమర్శించారు. చిటికేసి ఇల్లు, కార్యాలయాలు ధ్వంసం చేయగలనని హెచ్చరిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమన్నారు. టీడీపీ వాళ్లే పథకం ప్రకారం వాహనాలు, కుర్చీలు పక్కకు పెట్టి పందిరి తగలబెట్టి తమపై ఆరోపించడం సరికాదన్నారు. నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన అభ్యర్థి నైజం ప్రజలు గుర్తించాలన్నారు. 2019లో తాను ఇక్కడ పోటీ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు పెదకూరపాడు నియోజకవర్గంలో ఎక్కడైనా ఇటువంటి పోకడలు చోటుచేసుకోలేదన్నారు. ఈ సంఘటన పై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులకు సరైన శిక్ష వేయాలని కోరుతున్నట్లు ఎమ్మెల్యే నంబూరు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నకు రెండు కళ్లు



జమ్మలమడకలో యాదవ సంఘం ఆధ్వర్యంలో అనిల్‌కుమార్ యాదవ్, పీఆర్కే, పీవీఆర్‌లకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు



మాచర్ల యాదవుల బజారులో గజమాల సమర్పించి స్వాగతం పలుకుతున్న నేతలు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్
- చంద్రబాబును నమ్మవద్దు : విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక భరోసా కల్పించారని వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకొచ్చిన ఆయనకు మరొక్కసారి ప్రజలంతా అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మండలంలోని జమ్మలమడకలో యాదవ సంఘం, యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రతి పేద ఇంటికీ జగనన్న సంక్షేమ పథకాలు అందించి వారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. గ్రామాల్లో సచివాలయం, రైతుభరోసా, వైఎస్సార్ క్లినిక్‌లు వంటి భవనాలు నిర్మించి అధికారులను ప్రజల వద్దకే తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఎన్నికలలో ఓట్లు, సీట్ల కోసం జిత్తుల మారి కూటమి మోసపూరిత హామీలతో మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలుపరచని చంద్రబాబును నమ్మవద్దని సూచించారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి 99 శాతం హామీలను అమలుపరిచిన జగనన్నకు మనందరం అండగా ఉందామని కోరారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు స్థానిక, నామినేటెడ్ పోస్టులలో కూడా 50 శాతం రిజర్వేషన్ కల్పించటమే కాకుండా పార్లమెంట్, అసెంబ్లీ సీట్లలో కూడా బీసీలకు అత్యధిక స్థానాలు కల్పించిన వైఎస్సార్ సీపీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి మల్లుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, పోతిరెడ్డి కోటిరెడ్డి, బూడిద సైదులు, పల్లపాటి గురుబ్రహ్మం, గ్రామ యాదవ యూత్, కాపు, రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బీసీలను పట్టించుకున్న గొప్ప నాయకుడు జగన్

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలో గల చౌడమ్మ దేవాలయంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని యాదవ బజారులో ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అక్కులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, కౌన్సిలర్ మురళి, నాగరాజు ఆధ్వర్యంలో వార్డుకు చెందిన యాదవ సంఘ నాయకులు, పెద్దలు, మహిళలు పెద్దసంఖ్యలో పూలు జల్లుతూ అనిల్‌కుమార్ యాదవ్, పీఆర్కే, పీవీఆర్, చలమారెడ్డిలకు ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. అనంతరం వారంతా వార్డులో పర్యటించి ప్రతి ఒక్కరితో మాట్లాడారు. బీసీల ప్రభుత్వం జగన్ ప్రభుత్వం అని, రాబోయే రోజులలో యాదవుల తోపాటు అన్ని పేద వర్గాలకు మేలు జరగాలంటే ఆయనకే అధికారం కట్టబెట్టాలని తెలిపారు. ఉత్తుత్తి హామీలతో ముందుకొచ్చే ప్రతిపక్షాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు బోయ రఘురామిరెడ్డి, తురకా కిశోర్, అబ్దుల్ జలీల్, బత్తుల ఏడుకొండలు, కౌన్సిలర్లు సిద్దయ్య, కరీముల్లా, పలువురు నాయకులు పాల్గొన్నారు.